క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నారాయణయాదవ్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ హనుమాన్ దేవాలయం నిర్మాణానికి సోమవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మన్నె కవితనారాయణయాదవ్ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.11వేల విరాళం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యాదగిరియాదవ్ నర్సింలుయాదవ్, భిక్షపతి, నరేష్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, సురేష్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు కావలెను

కొందుర్గు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయులుగా పనిచేయుటకు ఆసక్తి గలవారు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను సంప్రదించాలని ప్రిన్సిపాల్ థామస్ రెడ్డి సూచించారు. పాఠశాలలో ఆంగ్లం-2, కళాశాలలో జంతుశాస్త్రం-1, రసాయనశాస్త్రం-1 బోధించుటకు పీజీ, బీ.ఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 26న పాఠశాలలో డెమో క్లాస్ బోధించాలని సూచించారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 7995010622.

వర్షాలు కురవాలని పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: వర్షాకాలం ప్రారంభమైన ఇంత వరకు వర్షాలు కురవకపోవడంతో మండలంలోని ఈదులపల్లి గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పట్వారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు కురవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయండి

కొత్తూరు: విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గతేడాది విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, యూనిఫాంలు అందలేదన్నారు. దాంతో పాటుగా పాఠశాలల బలోపేతం, సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా విద్యా కమిటీలు, పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాటుతోనే సరిపెట్టకుండా నిర్ణీత సమయంలో కమిటీలు సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా వారికి అవగాహన కల్పించాలని కోరారు.

పక్షులు అల్లుకున్న గుళ్లు



చెట్టుకు పక్షులు అల్లుకున్న గుళ్లు

షాబాద్: మండలంలోని నరేడ్లగూడలో పాడుబడిన బావి ఉంది. ఈ బావి పక్కనే ఉన్న చెట్లకు పక్షులు గుల్లు నిర్మించుకున్నాయి. మనుషులు వివిధ రకాలుగా ఇళ్లు కట్టుకున్నట్లు పక్షులు కూడా వివిధ రకాల ఆకులు, నారలతో గూళ్లు నిర్మించుకోవడం చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలు సోమవారం సాక్షి కెమెరాకు చిక్కాయి.

శభాష్ సర్పంచ్



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రభాకర్

శంకర్‌పల్లి: మండలంలోని ఎల్వర్తిలో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి సోమవారం డీఆర్‌డీఏ ప్రభాకర్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్‌లు వెళ్తున్నారు. ఈ సందర్భంలో మండలంలోని ఏర్వగూడ సర్పంచ్ శ్రీకాంత్ గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ డ్రైవ్ చేసుకుంటూ మండుటెండలో రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరును అందిస్తున్నారు. వెంటనే కారులు నిలిపి సర్పంచ్ శ్రీకాంత్‌తో మాట్లాడారు. ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ నీరు అందిస్తున్న ఆయనను అభినందించారు. ఎండలో సహితం మొక్కలను నీరును ఒక సర్పంచ్ అందించడం గర్వించ దగ్గ విషయమన్నారు. ప్రతీ ఒక్కరు ఇలాంటి సర్పంచ్‌లను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

తెలంగాణ హరితవనం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: హరితహారం కార్యక్రమంతో రాష్ట్రం హరితవనంలా మారిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితహారం కార్యక్రమం చేపట్టారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూలోని మృగవని జాతీయ పార్కులో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో లక్షల మొక్కలు నాటి పల్లెలు, పట్టణాలను హరిత వనాలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రతిమ, సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ కమాలుద్దీన్, ఎంపీటీసీలు మల్లేష్, శ్రీనివాస్, అంజయ్య, నాయకులు జయవంత్, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

జీవకోటి మనుగడకు చెట్లే ఆధారం: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: జీవకోటి మనుగడకు చెట్లే ప్రాణాధారమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం శివారులోని అటవీప్రాంతంలో అటవీశాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు, వ్యవసాయ పొలాల్లో, విద్యాసంస్థల్లో నాటిన మొక్కలతో ప్రకృతి పచ్చదనాన్ని సాక్షాత్కరింపజేస్తుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరు మొక్కలను నాటడంతో పాటుగా సంరక్షించాలని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన తెలంగాణకు హరితహారం దేశానికే తలమానికంగా నిలిచిందని చెప్పారు. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ యశోదయాదగిరి గౌడ్, నాయకులు రాజా వరప్రసాద్, యాదగిరిగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



మొయినాబాద్: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

హరితహారంతో పర్యావరణానికి మేలు

కొత్తూరు: హరితహారంతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితహారం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల వారి మేలుకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, భిక్షపతి, జనార్దన్‌చారి, శివకుమార్, నర్సింహ్మా పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: మొక్కలను నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కొత్తూరు: మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ లావణ్య



షాబాద్: మొక్కలు నాటుతున్న ఎంపీపీ ప్రశాంతి రెడ్డి, సర్పంచ్, ఎంపీడీఓ తదితరులు



కొందుర్గు: మొక్కలు నాటుతున్న అధికారులు



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న సీఐ లక్ష్మారెడ్డి



నందిగామ: మొక్కలు నాటుతున్న జెడ్పీవైస్ చైర్మన్ గణేష్ తదితరులు



చేవెళ్ల: మొక్కలు నాటుతున్న ఏసీపీ ప్రభాకర్ తదితరులు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



మందులను అందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: ఉచిత వైద్యశిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపేట, కొనాయపల్లి, చౌలపల్లి, బోధునంపల్లి గ్రామాల్లో నమో ఆరోగ్యమస్తు కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల్లో 30 రోజుల పాటు వైద్యశిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రోగులకు ఉచితంగా మందులను అందిస్తామని, అవసరమైన వారికి టెస్టులను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్, మోహన్‌సింగ్‌నాయక్, శ్రీనివాసులు, శ్యాంసుందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రదీప్, నర్సింహ, గిల్వారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఐలయ్య, చందు, రాజశేఖర్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు మినీ గ్రంథాలయం ప్రారంభం

కేశంపేట: మండలంలోని నిర్దవెల్లిలో నిర్మించిన నూతన మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించడం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి భద్రప్ప తెలిపారు. ఎంపీపీ రవీందర్‌యాదవ్, స్త్రీ,శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి మహిళా క్లినిక్స్ ప్రారంభోత్సవం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



షాద్‌నగర్‌రూరల్: మహిళల ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం నేటి (మంగళవారం)నుంచి నూతనంగా ఆరోగ్య మహిళా క్లినిక్స్‌ను ప్రారంభించనుందని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని చించోడ్, కొందుర్గు, కేశంపేట, నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా క్లినిక్స్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళవారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు అన్ని రకాల వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మహిళా క్లినిక్‌లో 8 రకాల సరీ్వస్ ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. డయాగ్నొస్టిక్స్, స్క్రీనింగ్ ఆఫ్ ఓరల్ బ్రెస్ట్ అండ్ సర్వైకల్ క్యాన్సర్, మేనేజ్‌మెంట్ అండ్ ట్రీట్‌మెంట్ ఆఫ్ మైక్రోన్యూట్ డెఫిషియన్సీస్, మేనేజ్మెంట్ పోలిసిస్టిక్, ఒవేరియన్ సిండ్రోమ్, ఫ్యామిలీ ప్లానింగ్, నెలసరికి సంబంధించిన సమస్యలకు చికిత్సను అందజేస్తారని అన్నారు. 57 రకాల పరీక్షలు, 134 రకాల ప్రత్యేక పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రతిఒక్క కేసును పరీక్షించి వారికి సంబంధించిన మెడికేషన్స్ ఇస్తారని వివరించారు. మహిళలకు ఏమైనా సమస్యలు ఎదురైనా ఉచిత సర్వీసులతో 102 వాహనంలో కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రికి పంపిస్తారని తెలియజేశారు. మహిళా ఆరోగ్య క్లినిక్స్‌లో ప్రతి మంగళవారం 70మంది నుంచి 100మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఆరోగ్య క్లినిక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం

చేవెళ్ల: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం.సుధాకర్‌గౌడ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రర రైతు సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులకు రుణమాఫీ ఒకేసారి చేయాలని, ధరణిలో రికార్డులు సవరించాలని, గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, 50 సంవత్సరాల వయస్సు నుంచి రైతులకు పదివేల పింఛన్ ఇవ్వాలని, భూసార పరీక్షలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సబ్సిడీ విత్తనాలు ఇచ్చి పంటల బీమా పథకాన్ని అమలు పరచాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు సత్తిరెడ్డి, చంద్రయ్య, అమృత, వినోద, చంద్రకళ, మంజుల, అనుసూయ, యాదమ్మ, మాధవి, లక్ష్మణ్‌గౌడ్, నర్సింలుగౌడ్ ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

మున్సిపాలిటీని స్వాగతిస్తున్నాం

- రూ. 50కోట్ల నిధులు కేటాయించాలి
- బీజేపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: చేవెళ్లను మున్సిపాలిటీగా చేసేందుకు బీజేపీ స్వాగతిస్తోందని బీజేపీ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డిలు అన్నారు. సోమవారం బీజేపీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు మాటలు చెప్పి మాయ చేయడం అలవాటుగా చేసుకుందన్నారు. ఇటీవల చేవెళ్లలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు త్వరలో చేవెళ్లను మున్సిపాలిటీగా చేస్తామని ప్రకటించారు. బీజేపీ అభివృద్ధిని కాంక్షిస్తూ స్వాగతిస్తున్నామని చెప్పారు. అయితే, ఈ మాటలు ప్రకటనల వరకే పరిమితం కావద్దని, కొత్తగా మున్సిపాలిటీ అయితే ప్రజల్లో అనేక సందేహాలు, అపోహాలు ఉన్నాయని వాటిని దూరం చేసేందుకు సరైన అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీలో కలిసే గ్రామాలను ముందుగా ప్రకటించి ఆయా గ్రామాల ప్రజలకు ఉన్న అపోహలను తొలగించాలన్నారు. మున్సిపాలిటీగా మారితే వచ్చే నిధు, జరిగే అభివృద్ధి గురించి తెలు పాలన్నారు. కేవలం పన్నులు ఒక్కటే పెరుగుతాయని కాదు వాటితో పాటు అభివృద్ధి కూడా పెరుగుతుందని అర్థం అయ్యేలా చెప్పాలన్నారు.

రుణాల దరఖాస్తు గడువు పెంచాలి..

బీసీ లక్ష రూపాయల రుణాలపై ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. లక్ష రూపాయలు రుణాలు ఇస్తామని చెప్పి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం మీసేవ, తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిప్పుతున్నారని ఆరోపించారు. దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు సర్టిఫికెట్లు రాకుండా సర్వర్లు డౌన్‌లు చేసి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. చివరి 20వ తేదీని పొడగించాలని డిమాండ్ చేశారు. అంతేకుండా బీసీలకు ఇచ్చే ఈ లక్ష రూపాయల రుణం బీసీలోని అన్ని కులాల వారికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల నాయకులు కృష్ణగౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు సత్యనారాయణ, మండల నాయకులు అల్లవాడ శ్రీనివాస్‌రెడ్డి, దేవుని శర్వలింగం, శ్రీనివాస్, క్రిష్టారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అభిలాస్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి

కొత్తూరు: మనఊరు-మనబడిలో భాగంగా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో మరమ్మతులు చేసిన ప్రభుత్వ పాఠశాలలను నేడు(మంగళవారం) ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించనున్నట్లు ఎంఈఓ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యాభివృద్ధికి కేసీఆర్ కృషి

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ

మొయినాబాద్‌రూరల్: విద్య అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ అన్నారు. సోమవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అక్షయ పాత్ర ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. విద్య అభివృద్ధిలో విద్యార్థులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా సరఫరా చేయడం విద్యార్థుల అదృష్టమన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత విద్యకు వెళ్లాలని సూచించారు. నేడు విద్యాలయాలు ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి, ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధయ్య, కారోబార్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

కొందుర్గు: మండల కేంద్రంలో ఆగస్టు 27న నిర్వహించనున్న సౌత్ ఇండియా కుంగ్‌ఫూ కరాటే 37వ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్ కోరారు. సోమవారం టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్‌పటేల్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల కరాటే విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. టోర్నీలో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు షీల్డ్‌లు బహుకరిస్తామన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు రమేష్, రాజు, ప్రభు, నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, మాస్టర్లు

సమస్యలు మరిచి.. ఉత్సవాల్లో ఊరేగుతున్నారు

పీసీసీ సభ్యుడు మహ్మద్‌బాబర్‌అలీఖాన్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించి దశాబ్ది ఉత్సవాల పేరుతో నాయకులు, అధికారులు ఊరేగుతున్నారని పీసీసీ సభ్యుడు మహ్మద్‌బాబర్‌అలీఖాన్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యను చూపుతూ ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడి అభివృద్ధి పనులను అక్కడే వదిలేసి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి దశాబ్ది ఉత్సవాలను జరుపుకొంటున్నారని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ సొంత వార్డులో గత 10 రోజులుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పాలకులకు చీమ కుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. గత 10 రోజులు క్రితం కురిసిన వర్షాలకు డ్రైనేజీ పొంగిపోవడంతో డ్రైనేజీ పైభాగాన్ని తీసివేశారని అన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుండా అలాగే వదిలేయడంతో ఎంతో మంది మురుగు కాలువలో పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయని , దుర్వాసన వెదజల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యపై ప్రజలు సతమతమవుతున్నా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని చెబుతున్నా అధికారులకు, పాలకులు మాతో వస్తే అభివృద్ధి జరగని వార్డులను చూపిస్తామని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి గాంధీనగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, లేని యెడల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలీమ్‌షకీబ్, రఘు, గంగనమోనిసత్తయ్య పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను చూపుతున్న నాయకులు

తీరని చెత్త సమస్య

- రోజుకు పది ట్రాక్టర్లకు పైగా పోగు
- డంపింగ్ యార్డు లేక ఖాళీ స్థలంలోనే పారబోత
- ఆ స్థలంలో నుంచి బైపాస్ రోడ్డు వెళ్తుండడంతో అర్థం కాని పరిస్థితి

మొయినాబాద్: మండలంలో చెత్త సమస్య ఎక్కువైంది. ఇండ్ల నుంచి సేకరించిన చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చెత్తతో కంపోస్టు ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించినా అది అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డు ప్రైవేటు వ్యక్తుల భూమిలోకి వెళ్లడంతో గ్రామంలో సేకరించిన చెత్తనంతా ట్రాక్టర్లలో తెచ్చి ఖాళీ స్థలంలో వేస్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో నుంచి బైపాస్ రోడ్డు వేస్తుండడంతో చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో వేసిన చెత్త

పెరిగిన జనాభా, కొత్త కాలనీలు..

మొయినాబాద్ మండల కేంద్రం కావడంతో ఇటీవల కొత్త కాలనీలు విస్తరించాయి. జనాభా సైతం విపరీతంగా పెరడంతో ప్రతి రోజు సుమారు 10 ట్రాక్టర్ల చెత్త వెలువడుతోంది. దీంతో పాటు మండల కేంద్రంలోని షాపులు, చికెన్ సెంటర్లు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు సురంగల్ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతం నుంచి బైపాస్ రోడ్డు వెళ్తుంది. అక్కడ చెత్త వేయలేని పరిస్థితి నెలకొంది. కొత్తగా డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని పాలకవర్గ సభ్యులు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

స్థలం కేటాయించాలని కోరాం..



గతంలో నిర్మించిన డంపింగ్ యార్డు ప్రైవేట్ స్థలంలోకి రావడంతో ఆ స్థలాన్ని వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు లేక ఇబ్బందవుతుంది. స్థలం కేటాయించాలని మండల తహసీల్దార్‌కు విన్నవించాం. స్థలం కేటాయిస్తే చెత్త సమస్య తీరుతుంది.

-కరిమాబీషేక్ మహబూబ్, సర్పంచ్, మొయినాబాద్

స్థలాన్ని పరిశీలించాం



గతంలో నిర్మించిన డంపింగ్ యార్డు ప్రైవేట్ స్థలంలోకి రావడంతో ఆ స్థలాన్ని వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు లేక ఇబ్బందవుతుంది. స్థలం కేటాయించాలని మండల తహసీల్దార్‌కు విన్నవించాం. స్థలం కేటాయిస్తే చెత్త సమస్య తీరుతుంది.

- కరిమాబీషేక్ మహబూబ్, సర్పంచ్, మొయినాబాద్